ఆంధ్రజ్యోతి
Saturday, 8th December 2007

# నో'డల్'పై పెదవి విరపు

## పోరాటానికి దళిత, గిరిజన అధికారుల నిర్ణయం

*హైదరాబాద్, డిసెంబర్ 7 (ఆన్‌లైన్):* అధికారాలు, కీలక అధికారులు లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం నామ మాత్రంగా నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేసిందంటూ దళిత, గిరిజన అధికారుల ఫోరం పెదవి విరిచింది. అధికారాలు లేని ఏజెన్సీ అవసరం లేదని, దళితులు, గిరిజనులకు సమగ్రంగా నిధులను సమకూర్చే సంస్థను కోరుకుంటున్నామని డిమాండ్ చేసింది. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన దళిత, గిరిజన ఐఏఎస్, ఐపీఎస్, గ్రూపు-1 స్థాయి అధికారుల ఫోరం సమావేశంలో కీలకాంశాలపై చర్చ జరిగింది.

మాజీ ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ పున్నయ్య కూడా హాజరైనట్లు సమాచారం. బడ్జెట్‌లో దళితులకు అందాల్సిన న్యాయపరమైన కోటాపై సంబంధిత శాఖలపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఔట్‌సోర్సింగ్ విధానంతో రిజర్వేషన్లకు విఘాతం కల్గుతోందని, దళిత, గిరిజనులకు న్యాయం జరగడంలేదని, ఔట్ సోర్సింగ్‌ను వెనక్కు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. ఫోరం కార్యకలాపాల కోసం కామన్ గుడ్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు.